సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 6 । జూన్ । 2023



'అంగన్‌వాడీ' సేవలపై సమీక్ష

అంగన్‌వాడీ కేంద్రాల సేవలు, లక్ష్యాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథ్ సమీక్ష నిర్వహించారు. 8లో



విశాఖలో అరవింద్ వాలియా

రక్షణ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అరవింద్ వాలియా విశాఖలో సోమవారం పర్యటించారు. 8లో

నీటి సరఫరాకు అంతరాయం నేడు



నరవ నుంచి టీఎస్ఆర్ కాంప్లెక్స్ వరకు ఉన్న రైవాడ మంచినీటి సరఫరా పథకం ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టనుండడంతో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. 8లో

ఎకో వైజాగ్.. మన లక్ష్యం

- తీరం శుభ్రం చేసేందుకు 5 ఎలక్ట్రిక్ వాహనాలు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానంలో విశాఖను నిలపాలి
- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపు



ప్రతిజ్ఞ చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎంపీ చంద్రశేఖర్, మేయర్ హరివెంకటకుమారి, తదితరులు

బీచ్‌రోడ్డు: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని ఆర్.కె.బీచ్‌లో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతర్జాతీయ సంస్థ అయిన పార్లే ఫర్ ది ఓషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. త్వరలోనే ఆ సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభిస్తుందన్నారు. తీరంలోని ప్లాస్టిక్‌ను తొలగించేందుకు ఐదు ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కాలుష్యం నియంత్రణ కోసం జీవీఎంసీకి 10 వాహనాలు అందించినట్లు చెప్పారు. కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని.. అందుకు ఎకో వైజాగ్‌లో పొందిపర్చిన ఎకో క్లీన్, ఎకో బ్లూ, ఎకో ప్లాస్టిక్, ఎకో కాలుష్యం, ఎకో గ్రీన్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఎకో వైజాగ్‌గా ఉంచటానికి ప్లాస్టిక్ నిషేధంతో పాటు మొక్కలు నాటాలని, వాహనాల వినియోగం తగ్గించాలని, విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలన్నారు. విశాఖలో మరింత పటిష్టంగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణలో గతేడాది విశాఖ నాలుగో స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది మొదటి స్థానం సాధించాలని.. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ఎకో వైజాగ్ పోస్టర్‌ను ఆవిష్కరించి, అవగాహన ర్యాలీని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాను ప్రతీ సోమవారం ప్రజారవాణా వినియోగిస్తూ.. కార్యాలయానికి చేరుకుంటున్నట్లు మేయర్ గొలగాని హరివెంకట కుమారి తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ నిషేధాన్ని మరింత పటిష్టంగా, కఠినంగా అమలు చేస్తామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ, విజయనగరం ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ రఘు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జేఈఈ ప్రసాదరావు, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సాధిక్ పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో జరిగిన పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న నగర ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పర్యావరణ పరిరక్షణపై నగరవాసులకు అవగాహన కల్పించడంలో భాగంగా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం బీచ్‌కు వచ్చిన సందర్శకులకు మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఏటీబీ మిషన్‌లో రూ.10 వేస్తే క్లాత్ బ్యాగ్ రావడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన షూలు, సీడ్‌బాల్స్, పిచ్చుకల కోసం బౌల్స్ వంటివి వాటిని నగర ప్రజలు తిలకించారు.



ఏటీబీ మిషన్‌ను పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి



భవిష్యత్‌ను కాపాడాలని విద్యార్థుల పిలుపు

విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలి

బీచ్‌రోడ్డు: కాలుష్య నివారణలో భాగంగా ప్రజలు విద్యుత్ వాహనాల వినియోగం పెంచాలని టీటీడీ చైర్మన్‌వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆర్కే బీచ్‌లో నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల(బైకులు, కార్లు)ను ఆయన పరిశీలించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఇంధన వాహనాల వినియోగం తగ్గించడం శ్రేయస్కరమని చెప్పారు.

పేద రోగులకు మెరుగైన వైద్యం

- కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా శివానంద్ బాధ్యతల స్వీకరణ



కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన శివానంద్‌ను అభినందిస్తున్న అధికారులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.శివానంద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ పి.అశోక్‌బాబు అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స నిమిత్తం సెలవు పెట్టారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రాధాకృష్ణ వ్యవహరిస్తున్నారు. తాజాగా కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో(ఎఫ్ఏసీ) సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 1998లో శివానంద్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. 2012లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ఆ తర్వాత ఆర్‌డీసీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, శ్రీకాకుళం స్విమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన శివానంద్‌ను అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, మేనేజర్ పి.ఎస్.శర్మ, చీఫ్ డైటీషియన్ హెచ్.వి.మూర్తి, ఆస్పత్రి ఉద్యోగుల సంఘం నాయకులు బి.జగదీష్, సిహెచ్.ప్రభాకర్, ఎస్.అప్పారావు, తదితరులు అభినందించారు. కేజీహెచ్‌కు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమని శివానంద్ తెలిపారు.

అందరూ సేఫ్

- లభ్యం కాని ఒకే ఒక్కరి ఆచూకీ
- నిలకడగా ప్రమాద బాధితుల ఆరోగ్యం
- పలు ఆస్పత్రుల్లో 8 మందికి చికిత్స
- మెరుగైన వైద్యం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒడిశా అధికారులతో నిరంతరం చర్చలు

సాక్షి, విశాఖపట్నం: యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఒడిశా రైలు ప్రమాదంలో విశాఖకు చెందిన ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారు. ఒకే ఒక్క ప్రయాణికుడి ఆచూకీ ఇంత వరకూ లభ్యం కాలేదు. ఒడిశాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 8 మంది ప్రయాణికులను రాష్ట్ర ప్రభుత్వం విశాఖకు తీసుకొచ్చి.. మెరుగైన వైద్యం అందిస్తోంది. స్వల్ప గాయాలతో బయటపడిన వారందరికీ ప్రభుత్వం తక్షణ సాయం కింద పరిహారం అందించింది. అయితే జనరల్ బోగీల్లో ప్రయాణించిన వారిలో ఎవరైనా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారున్నారా అనే అంశంపై నిరంతరం ఒడిశా ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఇంతవరకూ కుటుంబ సభ్యుల నుంచి తమ వారి ఆచూకీ తెలియలేదన్న ఫోన్ కాల్ ఏపీ కంట్రోల్ రూమ్‌కు రాకపోవడంతో.. ప్రస్తుతం గుర్తు తెలియని మృతదేహాల్లో ఇక్కడి వారు ఎవరూ ఉండరని అంతా భావిస్తున్నారు.

పెను విషాదాన్ని మిగిల్చిన ఒడిశా రైలు ప్రమాదానికి సంబంధించి ప్రయాణికుల ఆచూకీ తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. జిల్లాకు చెందిన ప్రతి ప్రయాణికుడినీ సురక్షితంగా ఇళ్లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం నిరంతరం పనిచేస్తోంది. ప్రమాదానికి గురైన కోరమండల్, యశ్వంత్‌పూర్ రైళ్లలో రిజర్వేషన్ కోచ్‌లలో మొత్తం 342 మంది విశాఖ నుంచి ప్రయాణం చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. వారి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. 10 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా.. ఆరుగురు మినహా అందరూ సురక్షితంగా ఉన్నట్లు గుర్తించారు. మరో ఎనిమిది మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో వారందరినీ.. ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా విశాఖ తీసుకొచ్చారు. కేజీహెచ్, సెవెన్‌హిల్స్, క్యూ1, అపోలో, ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి ఆస్పత్రుల్లో చేర్పించి.. మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వీరిలో సెవెన్‌హిల్స్‌లో చికిత్స పొందుతున్న లోకేష్, మిన్నీ దంపతులను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. వారిని ప్రత్యేక వాహనంలో వారి స్వస్థలానికి అధికారులు పంపించారు. మిగిలిన ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

ఆ ఒక్కరూ ఎవరు.?

మొత్తం ప్రయాణికుల్లో ఆరుగురు ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి ఒడిశా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ఆరుగురు వివరాలను పంపించిన అధికారులు.. ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారితో మ్యాచ్ చేయాలని కోరారు. రైల్వే అధికారులు, ఒడిశా ఐఏఎస్ అధికారులు, వైద్య సిబ్బంది కలిసి వారి వివరాలు సేకరించారు. ఇప్పటివరకు ఐదుగురు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామని జిల్లా అధికారులకు తెలిపారు. అయితే ఎవరెవరు సురక్షితంగా ఉన్నారు.. ఇంకా ఎవరి ఆచూకీ దొరకలేదన్న దానిపై స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఆ ఒక్కరు ఎవరు..? ఎక్కడ ఉన్నారు.. ఏ పరిస్థితుల్లో ఉన్నారనే వివరాల కోసం నిరంతరం శ్రమిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ బోగీల్లో కాకుండా.. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి వివరాలు మాత్రం ఎవ్వరికీ దొరకలేదు. ఈ బోగీల్లో ఉన్న వారిలో విశాఖకు చెందిన వారున్నారా లేరా అనే దానిపై స్పష్టత రాలేదు. ఇంతవరకూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తమ వారు కనిపించలేదని ఫిర్యాదులు రాలేదన్నారు. దీన్ని బట్టి జనరల్ బోగీల్లో దాదాపు ఉమ్మడి విశాఖకు సంబంధించిన వారెవ్వరూ లేరనేది స్పష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే విశాఖ వాసులంతా ఈ ఘోర ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినట్లే..

రైలు ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- రూ. 25 వేల నుంచి రూ.లక్ష వరకు చెక్కుల అందజేత
- ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయం
- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్



క్యూ–1లో చికిత్స పొందుతున్న రాజుకు చెక్కు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ



శంకరరావుకు చెక్కు అందజేస్తున్న మంత్రి



ప్రభుత్వం అందజేసిన చెక్కులు చూపిస్తున్న మాధవరావు, భారతి

మహారాణిపేట/ఆరిలోవ: రైలు ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రైలు ప్రమాదంలో గాయపడి విశాఖలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు సోమవారం పరామర్శించి.. ప్రభుత్వ సహాయాన్ని అందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి వీలైనంత త్వరగా కోలుకునే విధంగా చూడాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ రైలు ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తనతో పాటు, ముగ్గురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. అధికారులతో కలిసి తాము 10 గంటల్లో ప్రమాద స్థలికి చేరుకుని.. రాష్ట్రానికి చెందిన చెందిన 342 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని భువనేశ్వర్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి అనే వ్యక్తి మాత్రమే మరణించారన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అభినందించారని తెలిపారు. ఒడిశాలోని వివిధ మార్చురీల్లో 150 మృతదేహాలు ఉన్నాయని, మరో 24 గంటలు వేచి చూసిన తర్వాత ఈ మృతదేహాలకు సామూహిక అంత్యక్రియలు నిర్వహిస్తామని అక్కడి ప్రభుత్వం ప్రకటించినట్లు మంత్రి అమర్‌నాథ్ వెల్లడించారు. రాష్ట్రంలో కంట్రోల్ రూమ్‌లు కొనసాగుతున్నాయని, అలాగే 50 అంబులెన్స్‌లు, మహాప్రస్థాన వాహనాలను భువనేశ్వర్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఆ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేజీహెచ్లో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా రణస్థలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన అలుగోలు శంకరరావు రూ.లక్ష, విశాఖకు చెందిన బి.భారతి, మాధవరావుకు రూ.25 వేల చొప్పున చెక్కులను మంత్రి అందజేశారు.

- హెల్త్ సిటీలోని క్యూ–1 ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిలోవకు చెందిన భార్యాభర్తలు కె.రాజు, అరుణ, అపోలోలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం, ఎం.కొత్తూరుకు చెందిన కె.పూజను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. స్వల్ప గాయాలైన కె.అరుణకు రూ.25 వేలు, తీవ్ర గాయాలపాలైన కె.రాజుకు రూ.లక్ష, కె.పూజకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్ భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు, రూరల్ తహసీల్దార్ రమణయ్య పాల్గొన్నారు.

నా పిల్లలు కోసం మిగిలాను

'నాది శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం ఎం.కొత్తూరు. నేను నా భర్త ఒడిశాలోని బాలేశ్వర్ ప్రాంతంలో ఉండి కూలి పనులు చేస్తుంటాం. కోరమండల్ రైలులో సొంత ఊరు వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన చాలా సేపు నాకు స్పృహ లేదు. ఈ ప్రమాదంలో చేయి విరిగిపోయింది. నా భర్తకు గాయాలు కాలేదు. మాకు ముగ్గురు పిల్లలున్నారు. వారిని చూసుకోవడానికే నేను ప్రాణాలతో మిగిలాను.

– పూజా, రైలు ప్రమాద బాధితురాలు

ఏం జరిగిందో అర్థం కాలేదు



నాది ఆరిలోవ. నేను, నా భార్య అరుణ ప్లాస్టిక్ పువ్వులు వ్యాపారం చేస్తుంటాం. ఆ పువ్వుల కోసం మా ఇద్దరం కోల్‌కతా వెళ్లి తిరిగి కోరమండల్ రైలులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరం చెల్లా చెదురయ్యాం. నేను కొద్ది సేపు షాక్‌కు గరయ్యాను. తర్వాత తేరుకునే సరికి ఎడమ చేయి కదలలేదు. విరిగిపోయింది. కొంతసేపటికి నా పిల్లలు ఫోన్ చేయడంతో సేఫ్‌గా ఉన్నట్లు సమాచారం ఇచ్చాను. కొంతసేపటికి ఇద్దరం కలిశాం.

– కె.రాజు, ఆరిలోవ

ప్రభుత్వం మంచి వైద్యం అందిస్తోంది



నా భర్తతో పాటు ప్లాస్టిక్ పూలు కొనుగోలు చేయడానికి కోల్‌కతా వెళ్లి వస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఒకరికొకరం చాలా సేపు కనిపించలేదు. రిజర్వేషన్ దొరకకపోవడంతో మేము జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నాం. ఇంతలో ప్రమాదం జరిగింది. కొంతసేపటికి ఇద్దరం కలిశాం. వెంటనే పిల్లలకు ఫోన్ చేసి మాట్లాడాం. మాకు ప్రభుత్వం మంచి వైద్యం చేయించి ఆర్థిక సహాయం చేసింది.

–కె.అరుణ, ఆరిలోవ

వర్షా కాలంలో ముందస్తు ప్రణాళికలు

- కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశం
- 'జగనన్నకు చెబుదాం'కు 188 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : రానున్న వర్షా కాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణలో భాగంగా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో సమన్వయ సమావేశం రెండు రోజుల్లో నిర్వహించి తమకు నివేదిక అందజేయాలని సూచించారు. మండల స్థాయిలో సమస్యలు ఉన్న ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. భవనాలు శిథిలావస్థలో ఉంటే జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గెడ్డలు, కాలువల ఆక్రమణలు వెంటనే తొలగించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్బీకే, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జగనన్నకు చెబుదాంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 188 అర్జీలు అందగా.. ఇందులో రెవెన్యూ విభాగానికి 58, జీవీఎంసీ 56, పోలీస్ 13, ఇతర విభాగాలకు 61 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 57 ఫిర్యాదులు



సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సీపీ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 57 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె. రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏసీపీ(ఎస్‌బీ) వై.గోవిందరావు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 106 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'(స్పందన) కార్యక్రమానికి 106 వినతులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులకు ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యల వివరాలతో వచ్చే వారం జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఇలా చేయడం వల్ల నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారమయ్యాయో తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, ప్రధాన ఇంజినీర్(ఇన్‌చార్జ్) వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

- జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి 8, జోన్–3 నుంచి 11, జోన్–4 నుంచి 7, జోన్–5 నుంచి 10, జోన్–6 నుంచి 15, జోన్–8 నుంచి 12, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 42 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

న్యూస్‌రీల్

నగర పోలీస్ శాఖలో బదిలీలు

- 10 మంది ఏఎస్ఐలు, 61 మంది హెచ్‌సీలకు స్థానచలనం



దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లకు బదిలీలు జరిగాయి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం కలిగిస్తూ పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో 5 సబ్ డివిజన్ల పరిధిలో 10 మంది ఏఎస్ఐలు, 61 మంది హెడ్ కానిస్టేబుళ్ల మొత్తంగా 71 మంది బదిలీ ప్రక్రియను చేపట్టారు. ముందుగా నగరవ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిబంధనలు అనుసరించి బదిలీలు చేశారు. సీనియార్టీ ఆధారంగా సిబ్బంది కోరుకున్న చోటుకు ఖాళీల ప్రకారం పోస్టింగ్‌లిచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం చేపట్టిన ఈ ప్రక్రియలో అనారోగ్యం, స్పౌజ్, ప్రత్యేక అవసరాల కేసుల్లో మాత్రం అభ్యర్థనలను పరిగణలోనికి తీసుకున్నారు.

చదరంగం పోటీల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

విశాఖ స్పోర్ట్స్: అండర్–11 నేషనల్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ వాల్‌పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి సోమవారం విడుదల చేశారు. స్వర్ణభారతి స్టేడియంలో అక్టోబర్ 1నుంచి 9వ తేదీ వరకు చాంపియన్‌షిప్ జరగనుంది. పలు రాష్ట్రాలకు చెందిన అండర్–11 బాలబాలికలు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఏయూకు 43వ స్థానం

ఏయూక్యాంపస్: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)–2023లో జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 43వ స్థానంలో నిలిచింది. ఏయూ ఫార్మసీ కళాశాల 22వ స్థానాన్ని, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల 94వ స్థానాన్ని సాధించాయి. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ ర్యాంకింగ్‌లను ప్రకటించారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఏయూ ప్రథమ స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా 2,478 విద్యసంస్థలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో భాగం కాగా.. కేంద్ర విశ్వవిద్యాలయాలతో పోటీ పడి ఏయూ అత్యుత్తమ స్థానాలను సాధించింది. దేశ రాజధానిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాక్ చైర్మన్ సహస్రబుద్దే నుంచి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ధ్రువపత్రాలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ స్వీకరించారు.

అమిత్‌షా రాక వాయిదా

- 8కి బదులు 11కి మార్పు
- రైల్వే గ్రౌండ్‌లో బహిరంగ సభ

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనలో మార్పు చోటు చేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ వివిధ ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నగరంలో నిర్వహించే బహిరంగ సభకు అమిత్ షా హాజరు కానున్నారు. ముందుగా ఈ నెల 8న అమిత్‌షా సభ విశాఖలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సభను 11వ తేదీకి వాయిదా వేశారు. అమిత్‌షా సభను నగరంలోని రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆరోజు సాయంత్రం నిర్వహించాలని నిర్ణయించినట్లు బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. కాగా.. అమిత్‌షా విశాఖ పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ప్రతిపాదిత సభా ప్రాంగణాలను సోమవారం ఆయన పరిశీలించారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలో భాగంగా బాలుర ఫైనల్‌లో గీతం క్లబ్ 53–51తో సబ్బవరం జట్టుపై విజయం సాధించింది. బాలికల ఫైనల్‌లో ట్రూ బాలర్స్ చంద్రంపాలెం జట్టు 28–6తో జెడ్పీహెచ్ తోటగరువు జట్టుపై విజయం సాధించింది. జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో పోలీస్ బారెక్స్ బాస్కెట్‌బాల్ కోర్టులో సోమవారంతో ఈ పోటీలు ముగిశాయి.

4,502 మంది సర్టిఫికెట్ల పరిశీలన

మురళీనగర్ : పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి గత నెల 29 నుంచి నిర్వహిస్తున్న పాలిసెట్ కౌన్సెలింగ్ మంగళవారంతో ముగియనుంది. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా కౌన్సెలింగ్ ముగిసేనాటికి 4,502 మంది విద్యార్థులు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నారు. గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పాలిటెక్నిక్ కాలేజీలో కేడీవీ నరసింహారావు, పెందుర్తి కాలేజీలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు.

కోరమండల్ ప్రమాదం దృష్ట్యా
పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం దృష్ట్యా పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. పయాణికులు మార్పులను గమనించి సహకరించాలని కోరారు.

- బెంగళూరులో జూన్ 5, 6న బయల్దేరాల్సిన బెంగళూరు – హౌరా (12246) దురంతో ఎక్స్‌ప్రెస్ రద్దు.
- బెంగళూరులో జూన్ 5న బయల్దేరాల్సిన బెంగళూరు–హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ రద్దు.
- చెన్నై సెంట్రల్‌లో జూన్ 5న బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా (12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్ రద్దు.
- ఎర్నాకుళంలో జూన్ 5న బయేల్దారాల్సిన ఎర్నాకుళం -హౌరా(22878) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రద్దు.
- హౌరాలో జూన్ 5న బయల్దేరాల్సిన హౌరా – కన్యాకుమారి (12665) ఎక్స్‌ప్రెస్ రద్దు.
- తిరుపతిలో జూన్ 5న బయల్దేరాల్సిన తిరుపతి–సంత్రగచ్చి (22856) ఎక్స్‌ప్రెస్ రద్దు.
- హౌరాలో జూన్ 5న బయల్దేరాల్సిన హౌరా ➡ చెన్నై సెంట్రల్ (12839) ఎక్స్‌ప్రెస్ రద్దు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

మేయర్ గొలగాని హరివెంకటకుమారి



ఎలక్ట్రిక్ కారు వద్ద నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు



ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో మొక్క నాటి నీరు పోస్తున్న మేయర్ హరివెంకటకుమారి



పర్యావరణ వేత్తను సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి నగర ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జోన్–3 పరిధిలోని ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రపంచంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతోందని, ఎవరి స్థాయిలో వారు పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునీకీకరణ పేరిట సాధించిన అభివృద్ధి ప్రభావం కాలుష్యంపై పడుతుందని తెలిపారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్ల నాటే కార్యక్రమం, ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల తొలగింపు వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో దాదాపు 250 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతి వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఆస్పత్రి అభివృద్ధి పాలక మండలి సభ్యులు రూపాక రవికుమార్, డాక్టర్ నాగభూషణరావు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ పాత్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సహజ సిద్ధ పర్యావరణం అందిద్దాం

కొమ్మాది(భీమిలి): భావి తరాలకు సహజ సిద్ధమైన పర్యావరణాన్ని అందించాలని కలెక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. బీచ్ రోడ్డు రాడిసన్‌బ్లూలో రాష్ట్ర అటవీ శాఖ, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల సంయుక్తంగా సోమవారం నిర్వహించిన మీట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ (రీసైక్లింగ్, రియూజింగ్, రెడ్యూస్) అంశాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఏకో వైజాగ్‌కు ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీవోలు, ప్రజల సహకారం అవసరమన్నారు. జూ పార్కు క్యూరేటర్ నందిని సలారియా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇందిరాగాంధీ జూ పార్కు తరపున అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు విశేష సేవలు అందించిన పలువురిని సత్కరించి, అవార్డులు అందజేశారు. ఈ సదస్సులో వివిధ పరిరక్షణ పద్ధతులపై చర్చలు, ప్యానల్ సెషన్‌లు, ప్రెజెంటేషన్‌లో తమ అభిప్రాయాలు తెలియజేశారు. కన్జర్వేషన్ ఫొటోగ్రాఫర్ ధృతిమాన్ ముఖర్జీ పర్యావరణానికి సంబంధించి తాను తీసిన పలు అరుదైన ఛాయా చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, డీఎఫ్‌వో అనంత శంకర్, అదనపు టాక్స్ కమిషనర్ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యరహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

సీతమ్మధార(విశాఖ ఉత్తర): కాలుష్యరహిత ఆంధ్రప్రదేశ్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న అనేక విప్లవాత్మక నిర్ణయాలకు అందరి సహకారం అవసరమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. నెడ్‌క్యాప్ విశాఖ విభాగం ఆధ్వర్యంలో గో ఎలక్ట్రిక్ కాంపెయిన్‌ను గురుద్వార్ దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలతో పాటు కార్లను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునన్నారు. అనంతరం ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు, సిబ్బంది పర్యావరణ, పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సీజీఎంలు ఓ.సింహాద్రి, డి.సుమన్ కల్యాణి, అచ్చి రవికుమార్, ఎం.రామకృష్ణ, సిబ్బంది, నెడ్‌క్యాప్ జిల్లా నిర్వాహకుడు ఎం.వి.కె.రాజు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ సిబ్బంది పనితీరు అద్భుతం



ప్రమాద స్థలం వద్ద పునరుద్ధరణ పనులు పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : ఖరగ్‌పూర్ డివిజన్ పరిధి బహనగర్ బజార్ స్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన కోరమాండల్ ప్రమాద స్థలం వద్ద వాల్తేర్ డివిజన్ సిబ్బంది అద్భుతమైన సేవలు అందించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా 300 మంది సిబ్బందితో ప్రత్యేక రైలులో ఘటనా స్థలికి చేరుకుని అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి, అధికారులకు సహకరించారు. రికార్డు సమయంలో వేగంగా ఈ మార్గంలో రైళ్ల, ట్రాక్‌ల పునరుద్ధరణలో కీలకపాత్ర పోషించారు. అక్కడ పనులు పూర్తి అయిన తర్వాత వీరంతా సోమవారం మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకున్నారు. ఈ ప్రమాదం సందర్భంగా వాల్తేర్ డివిజన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ స్టేషన్లలో కమర్షియల్ సిబ్బందితో 24 గంటలు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేసి ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేసినట్లు తెలిపారు.

ఇద్దరు యువకుల దుర్మరణం



తేజ మృతదేహం



వినయ్ మృతదేహం

సీతమ్మధార(విశాఖ ఉత్తర): తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద కారు, బైకు ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కైలాసపురానికి చెందిన తేజ(20), చింత వినయ్(20) ఆదివారం రాత్రి 12.30 గంటల సమయంలో రైల్వే న్యూకాలనీ నుంచి తాటిచెట్లపాలెం మీదుగా సాలిగ్రామపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో సిగ్నల్ దాటుతుండగా ఎన్ఏడీ కూడలి నుంచి వచ్చిన కారు వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. వినయ్ అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడిన తేజను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తేజ మృతి చెందాడు. తేజకు పెళ్లి అయి మూడు నెలలైంది. తేజ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు వుమన్ ఎస్ఐ ప్రమిళ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరాకు అంతరాయం నేడు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నరవ నుంచి టీఎస్ఆర్ కాంప్లెక్స్ వరకు ఉన్న రైవాడ మంచినీటి సరఫరా పథకం ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టనుండడంతో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా నిలిపి వేయనున్నట్టు పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

- జోన్–8 పరిధిలో శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంతాపార్క్, టైలర్స్ కాలనీ, వుడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్‌ఆర్‌వీ పురం, రజక కాలనీ తదితర ప్రాంతాలు.
- జోన్–5 పరిధిలో మద్రిపాలెం, జ్యోతినగర్, మహారాణివీధి, బాపూజీనగర్, మాధవధార వుడా లేఅవుట్, మాధవధార, కళింగనగర్, ఎన్జీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్యానగర్, సిద్ధార్థనగర్, తుమ్మడిపాలెం, సుభాష్‌నగర్, భవానిగార్డెన్స్, కస్తూరి నగర్–1, శాంతినగర్–1, 2, సంజీవయ్యనగర్ హిల్ ఏరియా, బాపూజీనగర్–1, 2, అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రామ్‌నగర్, పెద్ద కొత్తూరు హిల్ ఏరియా, డౌన్ ఏరియా, రాంజీ ఎస్టేట్ డౌన్ ఏరియా, తిక్కవానిపాలెం కాలనీ, జయప్రకాష్ నగర్, కప్పరాడ–1,2, ఇందిరానగర్–4, 5, మహాత్మాగాంధీనగర్, జవహర్‌లాల్ నగర్, ఏఎస్‌ఆర్ నగర్, శ్రీనివాస్‌నగర్, పోలీస్ క్వార్టర్స్, పలనాటి కాలనీ, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గానగర్, అబిద్‌నగర్, పోస్ట్ ఆఫీస్ ఏరియా, గోలీలపాలెం, నందగిరినగర్, చెక్కుడు రాయి బిల్డింగ్ ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, 24/7 వాటర్ సప్లై ఏరియాలు.
- జోన్–3 పరిధిలో డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, చైతన్య నగర్, కనకమ్మ టెంపుల్ ఏరియా, కెపెన్‌లైన్స్, గాంధీనగర్ ఏరియా, శారదా స్కూల్ లైన్, ఓల్డ్ కో–ఆపరేటివ్ బ్యాంకు లైన్, క్రాంతినగర్, ఎన్‌హెచ్–16 రోడ్డు ఏరియా, రామకృష్ణానగర్, 80 ఫీట్‌రోడ్డు ఏరియా, ఎన్జీవోస్ కాలనీ, చిన్నూరు, మంగళవీధి, లలితానగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు.

విశాఖలో రక్షణ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్

సాక్షి, విశాఖపట్నం : రక్షణ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అరవింద్ వాలియా విశాఖలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా తూర్పు నౌకాదళాన్ని సందర్శించిన అరవింద్‌ను.. ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. తూర్పు నౌకాదళంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. సముద్ర భద్రతకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆధునిక సౌకర్యాల కల్పన కోసం.. చేపడుతున్న పనులకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తామని లెఫ్టినెంట్ జనరల్ అరవింద్ హామీ ఇచ్చారు.

సైనిక్ స్కూల్ లోకల్ బోర్డ్ సమావేశం

సింధియా: భువనేశ్వర్ సైనిక్ స్కూల్ 114వ లోకల్ బోర్డ్ అడ్మినిస్ట్రేషన్ సమావేశానికి తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని అధ్యక్షత వహించారు. పాఠశాల పురోగతిపై సమీక్షించారు. క్యాడెట్ అకడమిక్‌ల పని తీరును మెరుగుపరచడంతో పాటు ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీల ఎంపిక రేటుపై దృష్టి సారించాలని అధికారులను కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై సమీక్ష

ఎంవీపీ కాలనీ: అంగన్‌వాడీ కేంద్రాల సేవలు, లక్ష్యాలపై జేసీ కేఎస్ విశ్వనాథ్ సమీక్ష నిర్వహించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి, పీవోలు, సూపర్‌వైజర్లు, బీపీవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా స్త్రీ, బాలలకు పౌష్టికాహారం అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలంటే ఆధార్ నమోదు తప్పనిసరి అయినందున ఆరేళ్లలోపి పిల్లలు అందరికీ త్వరితగతిన ఆధార్ నమోదు చేయించాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలన్నారు. బలహీనంగా ఉన్న గర్భిణులకు అదనపు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం పీడీ వెంకటేశ్వరి సీడీపీవోలకు పలు సూచనలు చేశారు.

స్వయం ఉపాధికి జన శిక్షణ సంస్థాన్ బాటలు



అభ్యర్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీ జీవీఎల్

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): యువత స్వయం ఉపాధి బాటలో పయనించాలన్న సదుద్దేశంతో భారత ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్‌లను ఏర్పాటు చేసిందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. పిఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో పీఎంకేవీవై-4.0లో భాగంగా ఏర్పాటు చేసిన డిజిటల్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జీవీఎల్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా లక్షలాది మంది యువతకు ఉపాధి కోర్సుల్లో జన శిక్షణ సంస్థాన్‌లలో ఉచిత శిక్షణ ఇస్తున్నారన్నారు. విశాఖ జిల్లాలో మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సంస్థాన్ చైర్మన్ సి.ఎ.రామరాజు, సంస్థ సంచాలకుడు సిహెచ్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన గంజాయి నిందితుడు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ద్వారకా పోలీస్‌స్టేషన్ నుంచి పరారైన గంజాయి నిందితుల్లో మరొకరిని పోలీసులు చెన్నైలో అదుపులోకి తీసుకున్నారు. గత నెల 22న తమిళనాడు రాష్ట్రం కుడ్డాలూరు జిల్లా, కిజూహార్ మెయిన్ రోడ్డుకు చెందిన వి.సురేష్(22), త్రిమూర్తి(23)ను విశాఖలోని రామాటాకీస్ సమీపంలో ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ రాత్రి సిబ్బంది నిద్రలోకి జారుకోవడంతో ఇద్దరు నిందితులు బేడీలు తీసుకుని పరారు కావడం తెలిపిందే. సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలరాజు బృందాలుగా ఏర్పడి తమిళనాడు, కేరళలో గాలించారు. త్రిమూర్తిని గతంలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు వి.సురేష్(22)ను సోమవారం అరెస్ట్ చేయగా.. మంగళవారం నగరానికి తీసుకురానున్నారు.

అమిత్‌షా పర్యటన విజయవంతం చేయండి

సీతమ్మధార: రైల్వే ఫుట్‌బాల్ మైదానంలో జరిగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపునిచ్చారు. గురుద్వార్ దరి బీజేపీ ఉత్తర ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా 13 రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ పెద్దలు తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రంలో కట్టుబడి ఉంటామని, ఆహ్వానిస్తే పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు వెళ్తామన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సభాస్థలి కోసం మద్రిపాలెం జాతీయ రహదారి దరి శారదా బేకరీ మైదానాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు.

‘సీబీసీఎన్‌సీ’ విస్తీర్ణం ఎంత?

మహారాణిపేట: సీబీసీఎన్‌సీ ప్రాపర్టీ విస్తీర్ణం ఎంత, బిల్డర్‌కు ఎంత భూమి డెవలప్‌మెంట్‌కు ఇచ్చారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. మొత్తం ఆరు అంశాలను సంబంధించి వివరాలివ్వాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు.

చీటింగ్ కేసు నమోదు

కూర్మన్నపాలెం: లోన్ ఇప్పిస్తానని చెప్పి తన ఖాతా నుంచి రూ.35లక్షల వరకు ఇద్దరు వ్యక్తులు కాజేశారని బాధితుడు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివాడకు చెందిన ఉక్కు ఉద్యోగి జీబీఎస్ ముఖర్జీకి లోన్ ఇప్పిస్తానని చెప్పి గాజువాకకు చెందిన సిమ్మా మోహన్, హర్షసాయి వర్ధన్ నమ్మబలికారు. బ్యాంక్ ఉద్యోగి సాయంతో రూ.35లక్షల వరకు వారు తన ఖాతా నుంచి కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.